




పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు పరుగులు పెట్టిస్తున్నాం..

- టీసీఎస్ వచ్చింది, గూగుల్ డేటా సెంటర్ కూడా వస్తుంది



వి కన్వెన్షన్ హాలులో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

ముంబైకి దీటుగా విశాఖ అభివృద్ధి

- సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటుచేయబోతున్నాం
- అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ప్లాంటు, ఫార్మా పరిశ్రమలు
- సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్
- రాష్ట్రమంతా ఒక ఎత్తైతే.. విశాఖ మరో ఎత్తు
- ఇక్కడి ప్రజలకు రుణపడి ఉంటా
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- ప్రతి ఒక్కరూ యోగాంధ్రలో భాగస్వాములు కావాలని పిలుపు

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): **ప్రకృతి వనరులకు ఆలవాలమైన విశాఖపట్నం అంటే తనకు ఎంతో ఇష్టమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. నగరాన్ని ముంబైకు దీటుగా అభివృద్ధి చేస్తానని, అందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు.**

సోమవారం సాయంత్రం పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశాఖ ప్రజలకు తాను రుణపడి ఉంటానని, విశాఖకు ఎంత చేసినా తక్కువేనన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం అత్యధికంగా ఉన్న నగరం విశాఖ అని గుర్తు చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

కష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను అప్పుడు, ఇప్పుడూ కాపాడిందీ ఎన్‌డీఏ భాగస్వామ్య ప్రభుత్వమేనని చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. వాజపేయి హయాంలో ఒకసారి స్టీల్‌ప్లాంటును నష్టాల్లో నుంచి బయటకు తీసుకువచ్చామన్నారు. ఇప్పుడు మరోసారి రూ.11,500 కోట్ల ప్యాకేజీ ఇప్పించడం ద్వారా ప్లాంటును పరిరక్షించామన్నారు. ప్లాంటుపై కేంద్రం సందేహాలు వ్యక్తం చేసినప్పుడు నీళ్లు, విద్యుత్, భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చామన్నారు. తద్వారా కర్మాగారాన్ని కొనసాగించేలా చేసుకోగలిగామన్నారు. త్వరలో స్లర్రీ ద్వారా ముడి ఇనుము తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనివల్ల పరిశ్రమపై భారం తగ్గి లాభాల బాటలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి విశాఖపట్నంపై తనకు

... మిగతా 6వ పేజీలో



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

మనది కుటుంబ అనుబంధం..

పార్టీ కార్యకర్తలంతా తనకు ప్రాణ సమానులైన కుటుంబ సభ్యులని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సమావేశానికి ఐదారు గంటలు ఆలస్యమైనా కార్యకర్తల ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే ఎన్ని జన్మలు ఎత్తినా తెలుగుదేశం పార్టీ కుటుంబంలోనే పుట్టాలనిపిస్తోందన్నారు. 'మనది రాజకీయ అనుబంధం కాదు. కుటుంబ అనుబంధం' అని పేర్కొన్నారు. '45 ఏళ్లుగా చూస్తున్నా. నాతోపాటు మీరు కూడా ప్రజాసేవలో పునీతమయ్యారు. కరెక్ట్‌గా ప్లాన్ చేస్తే వేరే వాడు ఎవడూ ఏమీ చేయలేడు' అన్నారు. టీడీపీ కార్యకర్తలు పవర్ ఫుల్ అని, మీరు రోడ్డు మీదకు వస్తే ఎవడూ నిలబడలేరన్నారు. కార్యకర్తలకు అప్పుడప్పుడు అలక వస్తుందని, అటువంటిప్పుడు కాడె పడేస్తారన్నారు. అయితే, ఎక్కడికీ వెళ్లరని, ఏ జెండా పట్టుకోరని, ఎవరికి ఓటు వేయరని పేర్కొన్నారు. కానీ, ఆ అలకే ప్రమాదమన్నారు. అందుకే తాను ఒక నిర్ణయం తీసుకున్నానని, పార్టీ కార్యకర్తకు భవిష్యత్తులో అలక రాకుండా చేయడమే లక్ష్యమన్నారు. అందుకే ఇటీవల రెండు గంటలు ప్రజలు, ప్రభుత్వం కోసం పనిచేస్తే...మరో



బీచ్ రోడ్డులో యోగాడే ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం

రెండు గంటలు కుటుంబ సభ్యులైన పార్టీ కార్యకర్తల కోసం వెచ్చిస్తున్నానన్నారు. ఈ సమయం కొండనైనా బద్దలు చేసే టానిక్‌గా పనిచేస్తోందన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేయడం వల్ల పాత జిల్లాలోని అందరినీ చూడగలుగుతున్నట్టు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మనం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, దీన్ని తన మాటగా ప్రజలకు చెప్పాలన్నారు. పార్టీ కోసం సైనికుల మాదిరిగా పనిచేశారని, పార్టీ కూడా కార్యకర్తల గౌరవాన్ని కాపాడేలా చూసుకుంటుందన్నారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడ మంచివాళ్లు ఎక్కువగా ఉంటారన్నారు. ఈ ప్రాంతం ఎప్పుడూ టీడీపీకి కంచుకోటన్నారు. హుద్‌హుద్ తరువాత ఎన్నికలు ఎప్పుడు పెట్టినా టీడీపీ జెండా తప్ప మరొకటి ఎగురలేదన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్

- రేపు బాధ్యతలు స్వీకరించే అవకాశం



విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్‌గా కేతన్‌గార్గ్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఐదు నెలల తర్వాత జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించినట్టయింది. 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కేతన్‌గార్గ్ శిక్షణ అనంతరం విజయనగరం ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా దాదాపు ఏడాదిపాటు పనిచేశారు. అనంతరం రాజంపేట సబ్ కలెక్టర్‌గా, అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత మూడు నెలలు పాటు అదేజిల్లాలో జిల్లాపరిషత్ సీఈవోగా పనిచేశారు. గత ఏడాది జూలై నుంచి రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ప్రపంచ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పరిశీలన నిమిత్తం ప్రస్తుతం నగరంలోనే ఉన్న కేతన్‌గార్గ్ బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల 20న అనకాపల్లి రాక

డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న



అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 20వ తేదీన అనకాపల్లి రానున్నట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న తెలిపారు. సోమవారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, షర్మిల పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని నియోజకవర్గాల నేతలు పార్టీ కేడర్‌ను తరలించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ తనకాల అనంతరావు, నాయకులు పడాల కొండలరావు, కాళ్ల సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, బుద్ద కిశోర్, మలపురెడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక పరుగులు!

జిల్లాకు పలు ప్రముఖ కంపెనీలు రాక



రాంబిల్లి సెజ్‌లో నిర్మాణంలో ఉన్న ఒక ఫార్మా కంపెనీ

- రూ.1.85 లక్షల కోట్లతో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్రాజెక్టు
- నక్కపల్లి సెజ్‌లో బల్క్‌డ్రగ్ పార్కు
- ఇదే మండలంలో ప్రైవేటు రంగంలో రూ.1.47 లక్షల కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ రాక
- అచ్యుతాపురం, రాంబిల్లి ఫార్మా సెజ్‌లో క్యూ కడుతున్న ఔషధ కంపెనీలు
- కోడూరులో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఫార్మా రీసెర్చ్ సెంటర్
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు
- యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక రంగంలో అనకాపల్లి జిల్లా పరుగులు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తున్నది. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రముఖ దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇంధన, ఉక్కు, ఔషధ రంగాల్లో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ రంగ, ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తున్నాయి.

అనకాపల్లి జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మార్చాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కృతనిశ్చయంతో వున్నారు. అచ్యుతాపురం మండలం పూడిమడకలో 1,600 ఎకరాల్లో రూ.1.85 లక్షల కోట్లతో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్రాజెక్టుకు, నక్కపల్లి మండలంలోని ఏపీఐఐసీ సెజ్‌లో సుమారు 2,200 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలోనే విశాఖ పర్యటన సందర్భంగా వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ రంగంలో మొట్టమొదటి హరిత ఇంధన ప్రాజెక్టు కావడం విశేషం. రెండు దశల్లో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కానున్నది. నక్కపల్లి ఏపీఐఐసీ సెజ్‌లో ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా కలిసి జాయింట్ వెంచర్‌గా సుమారు రూ.1.47 లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. రెండు దశల్లో నిర్మించే ఈ ప్రాజెక్టులో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. అచ్యుతాపురం, రాంబిల్లి ఫార్మా సెజ్‌లో అనేక ఔషధ తయారీ కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లి మండలం కోడూరులో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫార్మా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు కానున్నది.

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కోసం ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం

... మిగతా 6వ పేజీలో

విద్యా శాఖలో బదిలీలు పూర్తి

ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఎంల నుంచి ఎస్‌జీటీల వరకు 2,200 మందికి స్థానచలనం

- కొత్త స్థానాల్లో చేరుతున్న ఉపాధ్యాయులు



18 మందికిగాను 15 మంది ఉపాధ్యాయులు బదిలీ అయిన అనకాపల్లి మండలం కొండకొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) ఉమ్మడి విశాఖపట్నం జిల్లా విద్యా శాఖలో బదిలీల కౌన్సెలింగ్ శనివారంతో ముగియడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులు సోమవారం నుంచి కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరిస్తున్నారు. గ్రేడ్-2 హెచ్‌ఎం, పీడీలు, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలు మొత్తం 2,200 మందికి స్థానచలనం కల్పించారు. ఎస్‌జీటీల్లో మేథ్స్ 270 మంది, ఇంగ్లీష్ 272 మంది, ఫిజిక్స్ 200 మంది, సోషల్ 220 మంది, తెలుగు 170 మంది, హిందీ 170 మంది, ఎన్‌ఎస్ టీటీర్లు 170 మందికి బదిలీలు అయ్యాయి. బదిలీ ఉత్తర్వులు జారీ చేసిన తరువాత వారం రోజుల్లో కొత్త స్థానాల్లో చేరాల్సి వుంటుంది. అనకాపల్లి మండలం కొండకొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులకుగాను ఏకంగా 15 మందికి స్థానచలనం కల్పించారు. ఇక్కడ నియమితులైన వారిలో ఇప్పటికే 13 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని 202 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం నుంచి పలువురు ఉపాధ్యాయులు అనకాపల్లి పరిధిలోని పాఠశాలలకు

... మిగతా 6వ పేజీలో

బ్యాంకులకు తల్లికి వందనం తాకిడి

- ఖాతాల నుంచి నగదు తీసుకోవడానికి వచ్చిన వారితో కిటకిట



ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో డబ్బులు డ్రా చేయడానికి వచ్చిన మహిళలు

దేవరాపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం కింద బ్యాంకు ఖాతాల్లో జమ అయిన డబ్బులు డ్రా చేయడానికి మహిళలు బ్యాంకుల బాట పట్టారు. దీంతో అన్ని బ్యాంకుల వద్ద రద్దీ వాతావరణం నెలకొంది. బ్యాంకులకు రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతోపాటు తల్లికి వందనం డబ్బులు తీసుకోవడానికి వచ్చిన మహిళలతో బ్యాంకులు కిటకిట లాడాయి. కొంతమంది మహిళలు తమ ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ అయ్యాయో, లేదో వాకబు చేయడానికి రాగా, అత్యధికులు డబ్బులు డ్రా చేయడానికి వచ్చారు. స్కూళ్లు తెరవడంతో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడానికి, పుస్తకాలు, యూనిఫారం కొనుగోలు చేయడానికి 'తల్లికి వందనం' డబ్బులు ఆసరాగా నిలిచాయని ఈ సందర్భంగా పలువురు

... మిగతా 6వ పేజీలో

అతిసార బారిన గిరిజనులు

ఫుడ్ పాయిజన్‌తో వాంతులు, విరేచనాలు

- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 13 మందికి వైద్య సేవలు
- ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ తరలింపు



అతిసార బాధితులను పరామర్శిస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి. పక్కన డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

నర్సీపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి తీసుకోకుండా బయటకు వచ్చేసిన 13 మంది అతిసార రోగులు సోమవారం నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రిలో చేరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి అందించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం రాగపట్నం, చల్లూరు గ్రామాల గిరిజనులు, నాతవరం మండలం సుందరకోట పంచాయతీ అసనగిరి గిరిజనులు కలిసి శనివారం పాడేరు మోదకొండమ్మ అమ్మవారి దర్శనానికి వెళ్లారు. వెంట తీసుకెళ్లిన పులిహోరను మధ్యాహ్నం తిన్నారు. కొద్దిసేపటి తరువాత వాంతులు, విరేచనాలు కావడంతో పాడేరు ఆస్పత్రిలో చేరారు. అయితే అసనగిరి గ్రామస్థులు ఆస్పత్రి వైద్యులకు చెప్పకుండా ఆదివారం రాత్రి బయటకు వచ్చేశారు. సోమవారం విరేచనాలు తగ్గక పోవడంతో నాతవరం పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడ మెడికల్ ఆఫీసర్ వైద్యం చేసి, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి పంపారు. వెలుగుల వరలక్ష్మి, ఆమె కూతురు లోవరాజు (11), పట్టెం వెంకటలక్ష్మి, ఆమె కుమారుడు కాశీబాబు(10), జర్తి చినబుజ్జి, జర్తి గంగా భవాని, పట్టెం వెంకయ్యమ్మ, బటారి వల్లమ్మ, బటారి అనిల్, చల్లా ప్రసాద్, చల్లా లక్ష్మి, బటూరి లక్ష్మి, ఆమె కూతురు సాయిదుర్గ చికిత్స పొందుతున్నారు. వీరిలో సాయిదుర్గ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. 26 వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రాంతీయ ఆస్పత్రికి వచ్చి రోగులను పరామర్శించారు.

అధ్వానంగా పంచాయతీ చెరువు


మురికినీరు, తుప్పలతో ఉన్న పంచాయతీ చెరువు

చెరువులోకి మురికి కాలువల అవుట్‌లెట్లు

చెత్త వేస్తున్న సమీప నివాసితులు

ఆక్రమణల పాలవుతున్న చెరువు గట్టు

పాయకరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించిన పంచాయతీ చెరువు ప్రస్తుతం మురికి నీటితో అధ్వాన స్థితిలో దర్శనమిస్తోంది. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును పట్టించుకున్నవారు లేకపోవడంతో గట్టు ఆక్రమణల పాలవుతోంది. మెయిన్ రోడ్డులోని పాత పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న ఈ చెరువుకు రెండున్నర దశాబ్దాల క్రితం వరకు పట్టణంలోని భూమి కాలువ నుంచి ఏటా వర్షాకాలంలో నీరు చేరేది. ఈ చెరువు 20 ఎకరాలకు సాగు నీరందడంతోపాటు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేది. కాలక్రమేణ పట్టణ ప్రజలకు కొళాయిల ద్వారా రక్షిత నీరు అందుతుండడంతో చేపల చెరువుగా మారి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చేది. అయితే అభివృద్ధి చెందుతున్న పాయకరావుపేట పట్టణానికి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ముస్లింవీధి, శెట్టిబలిజవీధి, తదితర ప్రాంతాల డ్రైనేజీ అవుట్‌లెట్లను ఈ చెరువుకు అనుసంధానం చేశారు. అప్పటి నుంచి మురికినీరు, చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండిపోయి మురికి చెరువుగా మారింది. ప్రస్తుతం చెరువు తుప్పలతో నిండిపోయి ఉనికి కోల్పోయింది. దీనికితోడు భూమి చానెల్ నుంచి నీరు వచ్చే కాలువ పూడుకుపోయింది. ఈ చెరువు గట్టు ఆక్రమణల పాలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చెరువు గట్టును పార్కుగా అభివృద్ధి చేసేందుకు దశాబ్దం క్రితం


చెరువులోకి మురికినీరు ప్రవహిస్తున్న దృశ్యం

పంచాయతీ పాలకవర్గం తీర్మానించినా ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా పడలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పంచాయతీ చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పెదదొడ్డిగల్లు భూములను కాజేసేందుకు కుట్ర

కలెక్టరేట్ ఎదుట రెండు గ్రామాల రైతుల ఆందోళన


పెదదొడ్డిగల్లు భూములను కాపాడాలంటూ ఆందోళన చేస్తున్న 2 గ్రామాల రైతులు

నక్కపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదదొడ్డిగల్లు సర్వే నంబరు-1లో పూర్వం నుంచి పేద రైతు కుటుంబాలు సాగు చేసుకుంటున్న 334 ఎకరాలను విజయవాడకు చెందిన వ్యక్తి కాజేయాలని చూస్తున్నాడని పెదదొడ్డిగల్లు,సీతంపాలెం గ్రామాల రైతులు ఆందోళన చేశారు. సోమవారం సర్పంచ్ గొర్ల విజయలక్ష్మి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, గొర్ల నాగ అప్పలరాజు ఆధ్వర్యంలో రైతులు అనకాపల్లి కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతులు ఆందోళన చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ విజయవాడకు చెందిన సుబ్బరాజు అనే వ్యక్తి కొంతమంది అధికారులు, నాయకులతో కుమ్మక్కై బినామీ పేర్లతో జీపీఏ రిజిస్ట్రేషన్‌ను మూడేళ్ల క్రితం చేసుకున్నాడన్నారు. తక్షణమే ఈ దొంగ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని సర్పంచ్ విజయలక్ష్మి డిమాండ్ చేశారు.

సాగునీటి కాలువలకు జీవం

పేరుకుపోయిన వ్యర్థాలు, తుప్పలు తొలగింపు

వ్యవసాయానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం

వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి కాలువలు

మునగపాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి ముఖ్యమైన సాగునీటి కాలువలు వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో కాలువలన్నీ వ్యర్థాలతో నిండాయి. తుప్పలు, రకరకాల పొదులతో కాలువలు స్వరూపాన్ని కోల్పోయాయి. దీంతో కాలువల ద్వారా నీరు ప్రవహించకపోవడంతో పంట భూములకు నీరందని దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి కాలువల ప్రాధాన్యతను గుర్తించింది. వాటికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించింది. దానిలో భాగంగా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, బాధ్యతలను రైతులకు అప్పగించింది. వారికి భరోసాగా ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేయించి, సమస్యలను గుర్తించింది. అటువంటి గుర్తింపు కలిగిన వాటిలో మునగపాక పరిధిలో ఉన్న కృష్ణంరాజు సాగునీటి కాలువ ఒకటి. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచనల మేరకు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, తుప్పలు, విరిగిపడిన


కృష్ణంరాజు కాలువ నుంచి కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

చెట్లు, కొమ్మలను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించే పనులు నీటి సంఘం ఆధ్వర్యంలో చురుగ్గా జరుగుతున్నాయి. పనులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. సోమవారం స్థానిక షిర్డీసాయిబాబా మందిరం వద్ద కృష్ణంరాజు కాలువలో పనులు చేపట్టారు. వైసీపీ పాలనలో ఇరిగేషన్ అధికారులు ఏమయ్యారో తెలియదుకాని ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మాత్రం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ సమస్యలను గుర్తిస్తున్నారని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి ప్రవాహాలకు అనువుగా కాలువలు రూపుదాల్చుతున్నాయని వారంటున్నారు. నీటి ముంపు నివారణకు కూడా ఇవి దోహదపడతాయని రైతులు చెబుతున్నారు.

చంద్రబాబుకు స్వాగతం పలికిన సుందరపు



యోగా డే ఏర్పాట్లు పరిశీలించడానికి సోమవారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విశాఖ ఎయిర్ పోర్టులో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు విజయకుమార్ భుజంపై చేయివేసి ఆహ్వానాన్ని అందుకున్నారు.

- ఆంధ్రజ్యోతి-అచ్యుతాపురం

పోలవరం ఎడమ కాలువపై అండర్ టన్నెల్ నిర్మించాలి

▸▸ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు


పోలవరం ఎడమ కాలువను రైతులతో కలిసి పరిశీలిస్తున్న అప్పలరాజు, సత్యనారాయణ తదితరులు

ఎస్.రాయవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపట్నం జగ్గారాణి చెరువులోకి నీరు వచ్చే విధంగా పోలవరం ఎడమ కాలువపై నుంచి అండర్ టన్నెల్ నిర్మించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు కోరారు. సోమవారం అక్కడ ప్రాంతాన్ని అప్పలరాజు స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం కాలువ నిర్మించక ముందు జగ్గారాణి చెరువులోకి నీరు వచ్చేదని, సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు నీరందేదన్నారు. ప్రస్తుతం సాగునీరు అందక నారు మళ్లు కూడా చేయలేని పరిస్థితుల్లో అక్కడ రైతులున్నారని తెలిపారు. ఇరిగేషన్, పోలవరం అధికారులు స్పందించి ఎడమ కాలువపై అండర్ టన్నెల్ నిర్మాణం చేపడితే జగ్గారాణి చెరువులోకి నీరు చేరుతుందని అప్పలరాజు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు కె. ప్రసాద్, వి. శివ, జి. కృష్ణ, ఎస్ బాబూజీ, పి. అప్పారావు, ఎం. సత్తిబాబు, జి. వెంకటరమణ, ఆర్ నాగు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం


చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నడింపల్లి గ్రామస్థులు

అచ్యుతాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద తల్లుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ అయిన సందర్భంగా మండలంలోని నునపర్తి పంచాయతీ నడింపల్లి గ్రామస్థులు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కుటుంబంలో చదువుకునే పిల్లలు ఎంత మంది వుంటే అంత మందికి ఈ పథకాన్ని వర్తింపజేయడం పట్ల వీరు ఆనందం వ్యక్తం చేశారు.

సందడిగా ఎంఈవో కార్యాలయం



టీచర్లకు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న ఎంఈవో రామారావు

కోటవురట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో ఎంఈవో కార్యాలయం సోమవారం సందడిగా మారింది. జిల్లాలో వివిధ మండలాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు ఎంఈవో రామారావును కలిసి జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. వారి కేటాయించిన పాఠశాలకు వెళ్లి జాయిన్ కావాలని ఎంఈవో సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి 26 మంది కొత్త వారు బదిలీపై వచ్చినట్టు ఎంఈవో రామారావు తెలిపారు.

గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు

▸▸ కలెక్టర్‌కు వేమగిరి గ్రామ యువకుల ఫిర్యాదు

ఎస్.రాయవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరిలో కొండను కొంతమంది ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వి లారీలతో గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నారని స్థానిక యువకులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు గ్రామానికి చెందిన యువకుడు కె.శివశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. గ్రామంలో జరుగుతున్న తవ్వకాలపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా.. ఏ విధమైన చర్యలు తీసుకోలేదన్నారు. గ్రావెల్ లారీలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పూర్తిగా పాడైపోతుందన్నారు. గ్రామంలో కొండతోపాటు తమ గ్రామాన్ని కాపాడాలని పేర్కొంటూ గ్రామానికి చెందిన కె.దుర్గ, ఎస్. భాస్కర్, కె. భార్గవ, బి. మణికంత, కె. రోహిత్, ఎం. సురేష్, ఎ. రంగ, డి. రాజు, టి సంతోష్ తదితర యువకులంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని శివశంకర్ చెప్పారు.

ఉపాధి కార్మికులను వేధిస్తున్న వీఆర్‌పీ

▸▸ ఏపీవోకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు


ఉపాధి హామీ కార్యాలయం ఎదుట కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న లాలం కాశీనాయుడు, లింగంనాయుడు

కోటవురట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం వీఆర్‌పీ ఉపాధి హామీ శ్రామికులకు సక్రమంగా పనులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు ఆరోపించారు. సోమవారం వేతనదారులు ఉపాధి హామీ కార్యాలయంలో అధికారులకు కార్మికులతో కలిసి వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు హాజరు వేయడంలో వీఆర్‌పీ తీవ్రజాప్యం చేస్తుందన్నారు. వీఆర్‌పీ నాగలక్ష్మి టీడీపీకి చెందిన వారిని లక్ష్యంగా వేధిస్తుందన్నారు. కూలీలు పట్ల కక్ష సాధింపు చేస్తుందని ఉపాధి కార్మికులు ఆరోపించారు. ఆమె చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు ఏపీవో నాగరాజుకు చేశారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

▸▸ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీఎస్ వర్మ


సభలో మాట్లాడుతున్న బీవీఎస్ వర్మ

పాయకరావుపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీఎస్ వర్మ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరులో బీజేపీ నాయకులు దాడి వెంకట సత్యనారాయణ, కల్లిగట్ల మూలాస్వామి ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాలలో భారతదేశం అన్ని రంగాలలోనే సర్వతోముఖాభివృద్ధి చెందిందన్నారు. అనంతరం అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వికసిత భారత్ జిల్లా కో-కన్వీనర్ డాక్టర్ భరత్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీరంగం రమేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోనే రంగయ్య స్వామి, కువ్వల కుమార్, దాసరి జగదీష్, వెంకటరమణ, ఎం.సూరిబాబు పాల్గొన్నారు.

వికసిత భారత్‌కు సహకరించాలి

ఎలమంచిలి: ప్రతి ఒక్కరూ వికసిత భారత్ 2047 సంకల్పాన్ని నెరవేర్చడానికి తమ వంతు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అగ్రహారపు కుమారస్వామి అన్నారు. ఏటికొప్పాకలో ఆదివారం రాత్రి జరిగిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు వికసిత్ భారత్ ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నేతలు బీవీఎస్.వర్మ, నక్కా శివశంకర్, పప్పు ఈశ్వరరావు, కొల్లు సత్యనారాయణ, లక్ష్మణ్, శివకోటి సతీష్, లోవరాజు, దారా నూకరాజులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి రెట్టింపు ప్రోత్సాహం

▸▸ తెలుగురైతు జిల్లా కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు


వాడ్రాపల్లిలో విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

మునగపాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అన్ని విభాగాల్లోను రెట్టింపు ప్రోత్సాహాన్ని అందిస్తోందని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి జడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం నగదును ఖాతాలకు జమచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పాఠశాల హెచ్.ఎం భీమిశెట్టి, కాండ్రేగుల నూకఅప్పారావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ దరఖాస్తులను లిఖితపూర్వకంగా తీసుకోవాలి'

మునగపాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, లిఖితపూర్వకంగా కూడా తీసుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకుడు ఎస్.బ్రహ్మాజి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయ కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల్లో చాలా వరకు నిరక్షరాస్యులు ఉన్నందున వారికి సమాచారం తెలిసే విధంగా ప్రచారం జరగాలన్నారు. ఆన్‌లైన్ విధానం వలన అనేక సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుందనిన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

రెండున్నర కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ఎస్.రాయవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు జంక్షన్ వద్ద సోమవారం రెండున్నర కిలోల గంజాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేయడం జరిగిందని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన దేవర రాజశేఖర్ అనే వ్యక్తి గంజాయికు అలవాటు పడి సీలేరు ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద నుంచి రెండున్నర కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. గంజాయిని బ్యాగ్‌లో పెట్టుకొని హైదరాబాద్ వెళ్లడానికి పెదగుమ్ములూరు జంక్షన్ వద్దకు వచ్చారు. అందిన సమాచారం మేరకు రాజశేఖర్ అనే వ్యక్తిని రెండున్నర కిలోల గంజాయితో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నుంచి అచ్యుతాపురం వెళ్లే మార్గంలో కొత్తపాలెం చెరకు కొనుగోలు కేంద్రం వద్ద ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం పడిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా భయాందోళనకు గురవుతున్నారు. గుర్తు తెలియని వాహనాం ఏదైనా ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం దెబ్బతిని ఉండవచ్చునని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రోడ్డు పక్కన భయానకంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని చూసి పలువురు భయపడ్డారు. ప్రమాదం చోటుచేసుకోకముందే అధికారులు స్తంభం మార్చితే మంచిదని పలువురు సూచిస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభం మార్పు చేయాలని వారు కోరుతున్నారు.

పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక, రాజయ్యపేటల్లో అనారోగ్యానికి గురైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయంలో ఉపమాకకు చెందిన చొప్పా శ్రీను, దయానంద్‌లకు ఒక్కొక్కరికీ రూ. 30వేలు చొప్పున టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఉపమాక ఆలయ మాజీ చైర్మన్లు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, వాసు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. రాజయ్యపేటకు చెందిన పిక్కి లక్ష్మణ్‌కు రూ69,260లు, పిక్కి కాశమ్మకు రూ 60,787 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆ గ్రామ టీడీపీ నాయకులు పిక్కి సత్తియ్య, పిక్కి రాంబాబు, పిక్కి గంగరాజు, పిక్కి కోదండరావు, మడదా రాంబాబు, శివాజీ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, వెలగా శ్రీను, కర్రి అంజనేయులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

పాయకరావుపేట రూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపట్నం పంచాయతీ శివారు పెద్దిపాలెంలో సోమవారం ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో గొర్ల సత్యనారాయణకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. సోమవారం భార్యాభర్తలు ఉపాధి పనికి వెళ్లారు. తరువాత పూరింటికి నిప్పు అంటుకుని పూర్తిగా కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. ఉపాధి పనికి వెళ్లే ముందు కట్టెల పొయ్యి అగ్గి ఆర్పివేసినా తరువాత కూడా అగ్గి చెలరేగి తాటాకులకు మంటలు అంటుకుని ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంటిలో సామాన్లు, బట్టలు, ఆధార్ కార్డుతో సహా కాలి బూడిదయినట్టు భార్యాభర్తలు వాపోతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

తాగునీటి కోసం ఆందోళన

అచ్యుతాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తాగునీరు లేక ఇబ్బందుల పడుతున్నామని మడుతూరు ఎస్‌సీ కాలనీ వాసులు సోమవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఎస్‌సీ కాలనీలో తాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, దూర ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకోవలసి వస్తోందని వారు వాపోయారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వెంటనే తాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని వీరు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కె. సోమునాయుడు, నాగేశ్వరి, శ్రీలత, ఉమామహేశ్వరి, ఆదిలక్ష్మి, అమ్మాజి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు రూ. ఐదు వేలు, పుస్తకాల వితరణ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కొనెంపాలెం ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఎం.సురేష్ నాయుడు తన కుమారుడు చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం రూ.ఐదు వేలు వితరణ చేశారు. అంతేకాక విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్ల తదితరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రూపాదేవి, పాఠశాల చైర్మన్ సీహెచ్ సరస్వతి, వైస్ చైర్మన్ గురయ్య పాల్గొన్నారు.

సైకిల్ షెడ్ నిర్మించిన పూర్వ విద్యార్థులు



సైకిల్ షెడ్‌ను ప్రారంభించిన దృశ్యం

మునగపాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సైకిల్ షెడ్ నిర్మించి పాఠశాలపై ప్రేమ, విద్యార్థులపై అభిమానం 1993-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు చాటుకున్నారు. పూర్వ విద్యార్థులంతా విరాళాలు వేసుకొని సైకిల్ షెడ్ నిర్మించి సోమవారం పాఠశాలకు అప్పగించారు. ఈ షెడ్‌ను సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, ఆడారి గంగ మహేష్, సూరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం రేపు

ఎస్.రాయవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె. రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.రాయవరం, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ బస్ బార్ ఎల్‌సీ పనుల్లో భాగంగా కరెంట్ ఉండన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

పట్టణంలో వైసీపీ పుస్తకావిష్కరణ


పుస్తకం విడుదల చేస్తున్న వైసీపీ నేతలు

ఎలమంచిలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయంలో వైసీపీ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు తదితర నేతలంతా కలిసి జగనన్న అంటే నమ్మకం..అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు కిషోర్‌రాజు, కోన బుజ్జి, శ్రీను బాబు, ఆడారి గణపతి, దూది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెట్రో వర్సిటీ భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

▸▸ నిర్మాణ పనుల్లో ఉండగా ప్రమాదం ▸▸ ఆలస్యంగా వెలుగులోకి..



మృతి చెందిన కార్మికుడు షేక్ ఉమ్మరవల్లి

సబ్బవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంగలిలో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) వర్సిటీలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కార్మికుడు పడి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. జిల్లాలోని చోడవరానికి చెందిన కార్మికుడు షేక్ ఉమ్మరవల్లి భవన నిర్మాణ కార్మికుడు. గత కొద్ది రోజులుగా వంగలి ఐఐపీఈలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో చేరాడు. ఈనెల తొమ్మిదో తేదీన పని చేస్తుండగా ఓభవనం పైనుంచి కాలుజారి పడి మృతి చెందాడు. అయితే ఈ ఘటనను గోప్యంగా ఉంచి మృతుడి కుటుంబానికి రూ.మూడు లక్షలు ఇచ్చారు. ఇన్సూరెన్స్ కింద మరో రూ.15 లక్షలు ఇప్పిస్తామని సదరు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఇదిలావుంటే, ఈ విషయం సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి దృష్టికి రావ డంతో ఆమె వెంటనే స్పందించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరి హారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత కుటుంబం పక్షాన పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఈ సంఘటనపై సీఐ జి.రామచంద్ర రావును వివరణ కోరగా, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దండి : జడ్సీ



కార్మికులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రమణ

అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, ఎక్కడ చెత్తాచెదారం కనిపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ బీవీ రమణ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. జోన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. సదరు కార్మికులు చేపట్టిన చెత్త తొలగింపు పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఎన్టీఆర్ వైద్యాలయం, రైల్వేస్టేషన్ వద్ద గల అన్న క్యాంటీన్లను పరిశీలించారు. భోజనం చేసేందుకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం తన కార్యాలయంలో ఆర్పీలతో సమావేశమయ్యారు. 21వ తేదీన విశాఖలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతమయ్యేలా తమవంతు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ వై.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కోలాహలంగా 'రాజాసాబ్' టీజర్ లాంచ్



కేక్ కట్ చేస్తున్న ప్రభాస్ అభిమానులు

అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'రాజాసాబ్' టీజర్ లాంచ్‌ను పట్టణంలోని సత్యనారాయణ థియేటర్‌లో సోమవారం అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రభాస్ ఫ్యాన్స్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జీవీఎల్ఎన్ రాజు, గౌరవాధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాండ్రేగుల జోగేంద్ర, కొణతాల అరవింద్ పర్యవేక్షణలో రాజాసాబ్ టీజర్ సక్సెస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అభిమానులు ఆళ్ల ప్రసాద్, అశోక్, భీమరశెట్టి నారి, మంగవరపు గణేశ్, థియేటర్ తరపున బుద్ద శ్రీనివాసరావు, ఏజెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించాలి

కొత్తూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా అవగాహన ఉన్న వారిని మాత్రమే తీసుకోవాలని ఆ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రామానందంను కోరారు. సోమవారం ఆయనను కలిసి గత మూడేళ్లుగా జరిగిన కార్యక్రమాలను వివరించారు. ఎస్సీ ఎస్టీ సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయన్నారు. చట్టాలపై అవగాహన కల్పించే విధంగా పోలీసులు తమకు సహకారం అందించడం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలతో పాటు వసతి గృహాల అభివృద్ధి తదితరాలపై ప్రత్యే దృష్టిసారించాలని విన్నవించారు.

'వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై కక్షసాధింపు'

సబ్బవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైసీపీ శ్రేణులపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు సరికాదని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో జగన్ నమ్మకం- బాబు మోసం పేరిట ముద్రించిన పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను వైసీపీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైలపూడి భగవాన్‌జయరామ్, బోకం రామునాయుడు, గండి రవికుమార్, పాలిశెట్టి సురేశ్‌రాజ్, ఉప్పిలి కనకరాజు, కొటాన రాము, దెడ్డం ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఎస్ఐ మణికుమారి

కశింకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చట్టాలపై బాలికలకు సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఏఎస్ఐ ఎన్.మణికుమారి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సెల్ఫ్ డిఫెన్స్, సెల్ఫ్ ప్రొటెక్షన్ తదితరాల గురించి వివరించారు. బాలికలు ప్రతి రంగంలో రాణించి, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎం.ఎస్.స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు గౌరీ, ఉషా, ప్రవళ్లిక, లావణ్య, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జేపీఎల్ క్రికెట్ టోర్నీ చాంపియన్ పరవాడ

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలో జరిగిన జేపీఎల్ టీ20 క్రికెట్ టోర్నీలో పరవాడ జట్టు చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, గాజువాక జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో పరవాడ నాలుగు వికెట్ల తేడాతో గాజువాకపై విజయం సాధించింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యుజే విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. స్మాల్ న్యూస్ పేపర్స్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు హరినాథ్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి

▸▸ పరిష్కారం కాకుంటే ఆయా కారణాలను ప్రజలకు తెలపండి

▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు కలెక్టర్ ఆదేశం

▸▸ 282 మంది నుంచి అర్జీల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో డీఆర్వో

అనకాపల్లి కలెక్టరేట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అర్జీలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్‌లో సోమవారం డీఆర్ఓ సత్యనారాయణరావు, ఎస్‌డీసీ సుబ్బలక్ష్మిలతో కలిసి ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో కలెక్టర్ స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 282 మంది విచ్చేసి అర్జీలను సమర్పించినట్టు కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

ఇదిలావుంటే, జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏఎస్పీ ఎల్.మోహనరావు హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటి గురించి పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో 35 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఎస్ఐ డి.వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారపై ప్రజలకు విస్తృతంగా అవగాహన

▸▸ డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ



బ్యానర్, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ, వైద్య సిబ్బంది

అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో పాటు వర్షాలు కురుస్తుండడంతో అతిసార ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.బాలాజీ సూచించారు. అతిసార నివారణ కోసం 'స్టాప్ డయేరియా' పేరుతో ఈ నెల 16వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్, పోస్టర్లను సోమవారం ఆయన ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జూన్ నుంచి డిసెంబరు వరకు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధులబారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని, మూడుసార్లకు మించి వాంతులు/ విరేచనాలు అవుతుంటే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, మలవిసర్జన తరువాత చేతులను సబ్బు లేదా హ్యాండ్ వాష్ లిక్విడ్‌తో శుభ్రంగా కడుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్, జిల్లా గణాంకశాఖ అధికారి ఎ.రామచంద్రరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాల ఘనుడు మాజీ మంత్రి అమర్‌నాథ్

▸▸ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని కళ్లు తెరచి చూడాలి

▸▸ కూటమి నాయకులు హితవు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధికార ప్రతినిధి దూలం గోపీ

కొత్తూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాల్లో ఘనుడు వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అని జనసేన పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి దూలం గోపీ ఆరోపించారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ ఆదివారం కూటమి నాయకులపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. 2023 జూన్‌లో జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ద్వారా రాష్ట్రంలో 42.62లక్షల మందికి మాత్రమే చెల్లించారన్న విషయాన్ని అమర్‌నాథ్ గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం తల్లికి వందనం పథకాన్ని 67.27 లక్షల మందికి వర్తింపజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖమంత్రి నారా లోకేశ్‌లకే దక్కుతుందన్నారు. వెన్నుపోటు పుస్తకం అని కాకుండా గొడ్డలిపోటు రాజకీయాలని పుస్తకం రచిస్తే బాగుండేదన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతున్న విషయాలను ప్రాజెక్టుల వారీగా వివరించడంతో పాటు వైసీపీ నాయకులు కళ్లు తెరచి చూడాలని హితవు పలికారు. టీడీపీ అనకాపల్లి మండల అధ్యక్షుడు కర్రి బాబీ మాట్లాడుతూ కూటమి నేతలు క్వారీల్లో అక్రమాలు చేసినట్టు, తవ్వకాలు జరిపినట్టు నిరూపిస్తే వాటన్నింటినీ రాసి ఇచ్చేస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు చదరం నాగేశ్వరరావు, పూడి పరదేశినాయుడు, మాకవరం సర్పంచ్ నూకరాజు, నాయకులు గంగుపాం జగదీశ్, బంటు రవి, భరత్‌బాబు, కర్రి సత్యనారాయణ, అప్పికొండ గణేశ్, మంగా ఈశ్వర్, ఆళ్ళ శ్రీను, మళ్ళ రాంబాబు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యా సంస్థలు

▸▸ చర్యలు తీసుకోండి ▸▸ డీఆర్వోకు ఏఐఎస్ఎఫ్ ప్రతినిధుల వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

తుమ్మపాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వో సత్యనారాయణరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పాటించడం లేదన్నారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీజులను సైతం అధికంగా వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సదరు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు ఫణేంద్ర, వియ్యపురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

▸▸ టిడ్కో గృహ సముదాయంలో ఉపాధ్యాయుల ప్రచారం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు కృష్ణంరాజు

కొత్తూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం పంచాయతీ పరిధి టిడ్కో కాలనీలో ఉన్న పిల్లలను రామాపురం మోడల్ స్కూల్‌లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు పెనుమత్స కృష్ణంరాజు, కూటమి నాయకుడు కోన శ్రీను తదితరులు ప్రచారం నిర్వహించారు. పలువురి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చక్కని విద్యాబోధన సాగుందన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, బూట్లు, బ్యాగులు తదితరాలతో పాటు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడ్కో కాలనీ నివాసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దంగేటి ప్రసాద్, కార్యదర్శి పీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు బొండా ప్రసాద్, సంయుక్త కార్యదర్శి పెదిరెడ్ల ముత్యస్వామి, కోశాధికారి కాండ్రేగుల జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు చిత్తు'



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

పరవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ సూచించారు. నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కుటుంబాలు కూడా ఛిన్నాభిన్నంగా మారుతాయన్నారు. గంజాయి జోలికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకూడదన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు, అధ్యాపక సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఐద్వా ధర్నా



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు తక్షణమే స్థలాలు ఇవ్వాలన్నారు. కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని, స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుధ్యం మెరుగుపర్చడంతో పాటు వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో బి.రమేశ్‌నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు బంగారమ్మ, అన్నపూర్ణ, సీతామహాలక్ష్మి, సంతోషి, లక్ష్మి, అబద్ధం తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' డబ్బులు రాని వారికోసం గ్రీవెన్స్

సబ్బవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో విద్యార్థినీ విద్యార్థుల తల్లుల ఖాతాలకు వివిధ కారణాల వలన డబ్బులు జమకాని వారికోసం మంగళవారం నుంచి ప్రభుత్వం గ్రీవెన్స్ నిర్వహిస్తుందని ఎంఈవో-2 రవీంద్రబాబు తెలిపారు. ముందుగా సచివాలయానికి వెళ్లి ఏ కారణంతో రిజక్టు అయ్యిందో తెలుసుకోవాలన్నారు. అనంతరం వారు కోరిన పత్రాలతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల నకళ్లు జత చేసి అప్‌లోడ్ చేయించుకోవాలన్నారు. దరఖాస్తుపై చైల్డ్ ఇన్ఫో అని తప్పని సరిగా మెన్షన్ చేయాలని వివరించారు. తల్లికి వందనం పథకం డబ్బులు పడిని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

పశువైద్యాధికారిణులు బాధ్యతలు



బాధ్యతలు చేపడుతున్న చైతన్యమణి, అల్ఫోన్స్ జార్జ్

కశింకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండల పశువైద్యాధికారిణిగా డాక్టర్ చైతన్యమణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ నర్సింగబిల్లికి బదిలీపై వెళ్లి విధుల్లో చేరారు. పశువులకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని రైతులకు వారు సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొబ్బరి మొక్క నాటుతున్న టీడీపీ నాయకుడు చిన్న

పరవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని టీడీపీ టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న అన్నారు. రావాడ శివారు సోమినాయుడుపాలెంలో గల నూకాంబిక, మరిడిమాంబ ఆలయాల వద్ద తన సొంత నిధులతో సమకూర్చిన కొబ్బరి మొక్కలను సోమవారం నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలు నాటుకోవాలని సూచించారు. నాయకులు బండారు అప్పలనాయుడు, కూండ్రపు సన్యాసిరావు, సిరపురపు అప్పలనాయుడు, ఈశ్వరరావు, కృష్ణ, నాయుడు, నాయుడు, సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూఈఈయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలుగా మాధవి



మాధవి

అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈ ఈయూ) రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలిగా ఇక్కడి ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కె.మాధవి ఎన్నికయ్యారు. గుంటూరులో శని, ఆదివారాల్లో నిర్వహించిన మహాసభల్లో రాష్ట్ర నూతన కమిటీ 39 మందితో ఎన్నిక కాగా, వర్కింగ్ కమిటీ సభ్యురాలుగా మాధవికి అవకాశం లభించింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం ఇక్కడ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన నూకాలమ్మ (ఫైల్)

కశింకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాలెం పంచాయతీకి చెందిన వృద్ధురాలు అదృశ్యమైనట్టు పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలివి. బంగారయ్యపేట గ్రామంలోని గొల్లపేట వీధికి చెందిన పక్కుర్తి నూకాలమ్మ ఈ నెల 13వ తేదీ ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెదికినా ఫలితం లేకపోయింది. చివరకు వృద్ధురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.


విశాఖ డెయిరీలో ప్రమాదం

▸▸ కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలు

▸▸ క్షతగాత్రురాలు స్వస్థలం మాకవరపాలెం

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికురాలికి గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారంలోని స్టెరిలైజ్డ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్ఎఫ్ఎం) విభాగంలో సోమవారం సాయంత్రం కొన్ని బాటిళ్లలో ఉష్ణోగ్రత అధికం కావడంతో ఒక్కసారిగా పేలిపోయాయి. ఆ సమయంలో సమీపంలో విధులు నిర్వహిస్తున్న లగుడు రాము (45)పై గాజుపెంకులతో పాటు వేడి పాలు పడ్డాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమి త్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. మాకవరపాలెం మండల కేంద్రానికి చెందిన ఆమె ఇటీవలే విధుల్లో చేరినట్టు సిబ్బంది తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జీసీసీ చైర్మన్ కిడారి



మంత్రి లోకేశ్‌తో జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, పీలా గోవింద

పాడేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన జీసీసీ, గిరిజనాభివృద్ధికిపై స్వల్పంగా చర్చించారు. అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు, తదితరులున్నారు.

గిరిజనులకు పూర్తి స్థాయిలో పథకాలు : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):గిరిజనులకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని చిన్నగెడ్డ, లోతుగెడ్డ, సోమవరం, తీగలమెట్ట గ్రామాల్లో స్థానిక సర్పంచుల అధ్యక్షతన నిర్వహించిన దర్తి ఆబా జన భగిదరి అభియాన్ గ్రామసభలో ఆయన మాట్లాడారు. గిరిజనులు, పీవీటీజీలకు శతశాతం ప్రభుత్వ పథకాలు అందించేందుకు గ్రామ సభ నిర్వహించి ప్రత్యేక సర్వే చేపడుతున్నామన్నారు. ఈనెల 30 వరకు గిరిజన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఐటీడీఏస్ అధికారులు ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్ ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత, సర్పంచ్ చింతర్ల సునీల్, ఐసీడీఎస్ సీడీపీవో రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకుమార్ పాల్గొన్నారు.

'గిరిజన ప్రాంతంలో జనసేనకు ఆదరణ'



సమావేశంలో మాట్లాడుతున్న కోర్ కమిటీ సభ్యుడు వీరవెంకట్

గూడెంకొత్తవీధి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో జనసేన బలపడుతున్నదని ఆ పార్టీ నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యుడు గొర్లె వీరవెంకట్ అన్నారు. సోమవారం రింతాడ పంచాయతీలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. రూ.వెయ్యి కోట్లతో గిరిజన గ్రామాలకు రహదారులు వేస్తారన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన ప్రజలు జనసేనలో చేరేందుకు అసక్తి చూపుతున్నారన్నారు. అనంతరం జనసేన పార్టీ రింతాడ పంచాయతీ అధ్యక్షుడుగా కొయ్యం ఇమ్మానుయేలు, ఉపాధ్యక్షుడు మాచర్ల అనిల్ కుమార్, పాంగి గిరిబాబు, గౌరవాధ్యక్షుడిగా రాములుబాబు, ప్రధాన కార్యదర్శిగా గణేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యుడు కొయ్యం బాలరాజు, పెదవలస సర్పంచ్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి

పాడేరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఉన్న ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులను తక్షణమే రెన్యువల్ చేసి ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనాలు పెంచాలని ఏపీ ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సవర ఆనందరావు, మర్రి చిట్టిబాబు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన వారం రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీడీఏల పరిధిలో 1,327 మంది ఆదివాసీ మాతృ భాష ఉపాధ్యాయులు ఉండగా.. పాడేరు ఐటీడీఏ పరిధిలో 676 మంది గత ఐదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే మాతృ భాష ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలని కోరారు.

జలపాతంలో కొనసాగుతున్న గాలింపులు



డుడుమ జలపాతంలో గాలిస్తున్న సహాయక బృందాలు

ముంచంగిపుట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబీ)లోన డుడుమ జలపాతంలో గల్లంతైన పర్యాటకుడు అనిమెష్‌దాస్ (27) ఆచూకీ కోసం గాలింపులు కొనసాగుతున్నాయి. సోమవారం సైతం ఒడిశా లంతాపుట్టుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది, కోరాపుట్టుకు చెందిన (ఓడీఆర్ఎఫ్) సహాయక బృందాలు జలపాతంలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం కానరాలేదు. కోల్‌కతాకు చెందిన అనిమెష్‌దాస్ తన కుటుంబ సభ్యులతో కలసి గత శనివారం డుడుమ జలపాతాలను చూసేందుకు వచ్చి ప్రమాదవశాత్తు జలపాత ప్రవాహిత నీటిలో మునిగి గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన పర్యాటకుని ఆచూకీ కోసం జలపాతంలో ఒడిశాకు చెందిన సహాయక బృందాలు గత మూడు రోజులుగా ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నారు. అయినప్పటికీ పర్యాటకుడు ఆచూకీ కానరాలేదు. చీకటి పడడంతో గాలింపులు నిలిపివేశారు. మంగళవారం ఉదయం నుంచి గాలింపులు చేపడతామని సహాయక బృందాలు తెలిపారు.

26 మంది కంటి రోగులకు శస్త్రచికిత్సలు

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తున్నట్టు అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ తమర్భ విశ్వేశ్వరనాయుడు అన్నారు. సోమవారం లంబసింగి, చింతపల్లి, లంబసింగి ఆస్పత్రుల్లో 96 మందికి కంటి వైద్యనిపుణులు అనుష పరీక్షలు నిర్వహించారు. వీరిలో 26 మందిని శస్త్రచికిత్సల కోసం మైదాన ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ స్థానిక ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారన్నారు. గిరిజన ప్రాంతంలో విస్తృతంగా కంటి పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ రమణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రధాన మార్గం.. ప్రమాదకరం!

ముంచంగిపుట్టు-జోలాపుట్టు రోడ్డులో భారీ గొయ్యి

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

బిక్కుబిక్కుమంటూ వాహన చోదకుల రాకపోకలు



గుమ్మాసిరగంపుట్టు సమీపంలో కోతకు గురైన రహదారి

ముంచంగిపుట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు-జోలాపుట్టు ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. మార్గం మధ్యంలోని గుమ్మాసిరగంపుట్టు రోడ్డడ వద్ద దెబ్బతింది. రహదారికి ఆనుకుని మలుపు వద్ద భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి సగ భాగం కోతకు గురైంది. భారీ గొయ్యి ఏర్పడగా, సంబంధిత అధికారులు తూతూమంత్రంగా మరమ్మతు పనులు చేపట్టారు. ఫలితంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రహదారి మరికాస్త అధ్వానంగా మారింది. రహదారి కోతకు గురికావడంతో భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నామని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఏమాత్రం ఆదమరిచి అటుగా వెళ్లినా పెను ప్రమాదం బారిన పడతామని వారు భీతిల్లిపోతున్నారు. రోజు రోజుకు ఆ ప్రదేశంలో రహదారి పటుత్వం కోల్పోతుంది. భారీ గొయ్యిగా మరి పెద్దదిగా మారుతోంది. అధిక బరువుతో అటుగా వెళ్తే వాహనాలు ప్రమాదాల బారిపడక తప్పదు.

ఇప్పటికే ఆ ప్రదేశంలో పలు వాహన ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ ఆ ప్రదేశంలో కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో వాహన చోదకులు, పరిసర గ్రామాల ప్రజలు కోతకు గురైన రహదారి చుట్టూ అటుగా వాహనాలు వెళ్లకుండా రాళ్లను పెట్టారు. నిత్యం ఈ మార్గంలో ఆంధ్రా ఒడిశాకు చెందిన వాహనాలు తిరుగుతుంటాయి. ఇరు రాష్ట్రాలకు ఇదే ప్రధాన రహదారి. అయినప్పటికీ అధికారులు దాని మరమ్మత్తులపై కనీసం దృష్టి సారించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది.

అలాగే మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యంలోని చోటాముక్కిపుట్టు, వనభసింగి తదితర ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. పెను ప్రమాదాలు జరగక ముందే ఆ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు గాఢ నిద్రను వీడి రహదారుల మరుమ్మతు పనులు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

తల్లికి వందనం లబ్ధిదారులతో యూబీఐ కిటకిట

- ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన రద్దీ
- రూ. 50 లక్షల వరకు లబ్ధిదార్లకు చెల్లింపులు



తల్లికి వందనం లబ్ధిదార్లతో కిటకిటలాడిన సీలేరు యూనియన్ బ్యాంక్

సీలేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంక్ సోమవారం ఉదయం నుంచి తల్లికి వందనం లబ్ధిదార్లతో కిటకిటలాడింది. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి రూ.13 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాలకు డబ్బులు జమ చేసింది. ఆ డబ్బులను డ్రా చేసేందుకు ఐదు పంచాయతీలకు చెందిన తల్లులు బ్యాంక్‌కు రావడంతో రద్దీ నెలకొంది. ఒక్క సోమవారమే బ్యాంకు నుంచి తల్లికి వందనం లబ్ధిదారులకు రూ.45 లక్షల నుంచి 50 లక్షల వరకు చెల్లించినట్టు బ్యాంకు సిబ్బంది తెలిపారు. కొంతమంది లబ్ధిదారుల అకౌంట్లు ఆధార్‌కు ఎన్‌పీసీ లింక్ కాకపోవడంతో డబ్బులు ఖాతాలో జమ కాలేదు. అటువంటి వారికి సీలేరు బ్యాంక్ సిబ్బంది ఆధార్‌కు ఎన్‌పీసీ లింక్ చేశారు. అలాగే బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ చేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బ్యాంక్ రద్దీగానే ఉంది.

చింతపల్లిలో 90 మంది ఎస్‌జీటీలకు స్థానచలనం



ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 90 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్థానచలనం జరిగింది. సోమవారం బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి పీబీవీవీ ప్రసాద్ రిలీవ్ చేశారు. ఈఏడాది సెండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 11 తేదీ నుంచి 15వ తేదీ వరకు విడతలవారీగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో నున్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆన్‌లైన్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు విద్యాశాఖ జారీచేసింది. ఈమేరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎంఈవో వద్ద రిలీవ్ ఉత్తర్వులు తీసుకుని పాత పాఠశాల నుంచి కొత్త పాఠశాలల్లో చేరారు. మండలం పరిధిలో 37 మందికి స్థానచలనం జరగగా మైదాన ప్రాంతాలకు 53 మందికి బదిలీ అయ్యింది. పొరుగు మండలాల నుంచి పది మంది ఉపాధ్యాయులు మండలానికి వచ్చారు. అయితే ఏకోపాధ్యాయులు, 50 శాతం కంటే తక్కువ ఉపాధ్యాయులు కలిగిన పాఠశాలల నుంచి బదిలీ అయిన ఎస్‌జీటీలు ఖాళీలు భర్తీ అయ్యే వరకు పూర్వ పాఠశాలలోనే విధులు నిర్వహించాలని ఆదేశించారు.

లేబర్ కోడ్‌ల రద్దుపై ఐక్యంగా పోరాడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పాడేరురూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మోదకొండమ్మ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు కోడ్‌లు అమలు జరిగితే కార్మికులు పోరాడే హక్కు కోల్పోతారన్నారు. అవసరమైతే కార్మికులు అంతా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు.పని గంటలు పెంచుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల సాధనకు జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. తల్లికి వందనం పథకం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, ఆశ తదితర చిరుద్యోగులకు వర్తించే విధంగా నిబంధనలను సడలించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్, కార్మిక సంఘాల నాయకులు సత్యనారాయణ, భగత్‌రామ్, ఎల్.సుందరరావు, కె.భాగ్యలక్ష్మి, కళావతి, మంజుల, పద్మ, మహేష్ పాల్గొన్నారు.

18న గురుకుల బాలుర జూనియర్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

పాడేరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఐదు గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలల్లో మిగిలి ఉన్న ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 18వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎల్.రజని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పెదబయలు, అరకువేలి, జి.మాడుగుల, కొయ్యూరు, చింతపల్లి మండలాల్లో ఉన్న జూనియర్ కళాశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరుకాని బాలురతోపాటు దరఖాస్తులు చేయని బాలురు కూడా ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని తెలిపారు.

పూర్తి వివరాలకు జిల్లా కళాశాల కన్వీనర్ ప్రిన్సిపాల్ ఫోన్ నంబర్ 9490957224ను సంప్రదించాలని ఆమె సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో యోగాపై శిక్షణ



కళాశాల ప్రాంగణంలో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

అరకులోయ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో యోగాపై సోమవారం శిక్షణ ఇచ్చారు. యోగాంధ్ర-2025లో బాగంగా యోగాసనాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు యోగాసనాలు వేయడంతో పాటు కుటుంబ సభ్యులకు వివరించి వారితోనూ వేయించాలని ఆయన సూచించారు. అలాగే యోగాసనాల గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా అందరితోనూ రోజూ యోగసనాలు వేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లికి వందనం నిబంధనలు సడలించాలని ధర్నా



ధర్నాలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

అరకులోయ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం నిబంధనలు సడలించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు ధర్నా చేశారు. నుంకరమెట్ట పంచాయతీ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. బడిబాట పట్టిన ప్రతీ విద్యార్థికి తల్లికి వదనం పథకం అమలు చేయాలని ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెలి చినబాబు కోరారు. గిరిజన ప్రాంతంలో ఉన్న బడిఈడు పిల్లలందరికీ ఈ పథకం కింద డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం అవసరమైతే నిబంధనలు సడలించాలని విన్నవించారు. లేనిపక్షంలో అర్హులైన గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తల్లికి వందన పథకం అందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలతో రేషన్ పంపిణీ ఇవ్వాలి

జి.మాడుగుల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని గిరిజన సంఘం నాయకులు సోమవారం గెమ్మెలి డీఆర్ డిపో వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు వనుగు సన్యాసిదొర మాట్లాడుతూ ఈ ప్రభుత్వం డీఆర్ డిపోల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయడం వల్ల మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.పిన్నంనాయుడు, ఎస్.సత్తిబాబు, ఎస్.భూషణం, కె.చిన్నబ్బాయి, ఎస్.కొండబాబు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోండి: ఎంపీపీ

అనంతగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎంపీపీ శెట్టి నీలవేణి సూచించారు. మండలంలోని భీంపోల్ పంచాయతీ సరియాపల్లి గ్రామంలోని సోమవారం సర్పంచ్ భీమ్మలమ్మ ఆధ్వర్యంలో దర్తి ఆబ జన్ భాగీదారి అభియాన్ పథకంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 20 పథకాలపై గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ఆధార్‌కార్డు, ఆయూష్మాన్‌భవ కార్డులు, పీఎం కిసాన్ ప్రయోజగనాలపై వివరించారు. ఎంపీడీవో ఏవీవీ.కుమార్, ఎంపీటీసీ సభ్యుడు అశోక్, టీడీపీ నేతలు ఈశ్వరరావు, కన్నయ్య పాల్గొన్నారు.

కొయ్యూరులో 30.7 డిగ్రీల ఉష్ణోగ్రత



ఉమాదేవి

పాడేరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి, దీంతో ఏజెన్సీలో సోమవారం కొయ్యూరులో 30.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా పాడేరులో 30.5, జీకేవీధిలో 30.0, హుకుంపేటలో 29.3, డుంబ్రిగుడలో 29.2, అరకులోయలో 29.1, చింతపల్లిలో 28.6, జి.మాడుగుల, అనంతగిరి, పెదబయలులో 28.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మండల వ్యవసాయాధికారి బదిలీ

కొయ్యూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) మండల వ్యవసాయశాఖాధికారిణి డి. ఉమాదేవి విశాఖపట్నం జిల్లా చినగదిలి మండల ఏవోగా బదిలీ అయ్యారు. ఆమె గడిచిన రెండేళ్లుగా ఆమె మండల ఏవోగా పనిచేశారు. ఆమె స్థానంలో టెక్కలి మండలంలో ఏవోగా పని చేస్తున్న భాను ప్రియాంకను నియమించారు.

పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు

కొయ్యూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు మండలానికి 654 క్వింటాళ్ల వరి విత్తనాలు 90 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు వచ్చాయని మండల వ్యవసాయశాఖాధికారిణి ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు ఆర్ఎన్ఆర్ 15048 రకం 150 క్వింటిళ్లు, ఆర్‌జీఎల్ 200, బీపీటి 50, ఎంటీయు 1121 రకం 80, ఎంటీయు 1064 రకం 50, ఎంటీయు 1224 రకం 24, ఎంటీయు 1318 రకం విత్తనాలు 100 క్వింటాళ్లు వచ్చాయన్నారు. ఆర్‌జీఎల్ 30 కేజీల బస్తా విత్తనాల ధర రూ.1,290 కాగా రాయితీ పోనూ రైతుకు రూ.129 లు అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఎంటీయు 1121, 1064, ఎన్ఎల్ఆర్ 34449, ఎంటీయు 1318 రకాలు ప్రభుత్వం రూ.1,260లు కాగా రాయితీ పోనూ రూ.126లకు, అలాగే ఆర్ఎన్ఆర్ 15048, బీపీటి 5204 రకాలు 25 కేజీల బస్తా ధర రూ.1,075 కాగా రాయితీ పోనూ రూ.107లకు, ఎంటీయు 1224 రకం రూ.1,050 లు కాగా రాయితీ పోనూ రూ.105లకు అందజేస్తామన్నారు.

ఎంఆర్‌సీకి చేరుకున్న విద్యార్థుల షూస్

చింతపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన షూస్ (బూట్లు) సోమవారం మండల కేంద్రానికి చేరుకున్నాయి. ఇప్పటికే పాఠ్య, నోట్ పుస్తకాలను తొలిరోజే విద్యార్థులకు అందజేసింది. అలాగే తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం నిధులను సైతం కుటుంబంలోనున్న పిల్లలందరికి జమచేసింది. ప్రస్తుతం షూస్ పంపిణీకి చర్యలు తీసుకుంటుంది. కాగా మండలానికి 13,827 షూస్ వచ్చాయి, మంగళవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తామని ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు తెలిపారు.

కంప్యూటర్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం

సీలేరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సీలేరు రైతు భరోసా కేంద్రంలో సోమవారం కంప్యూటర్ శిక్షణను పొందిన విద్యార్థులకు సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి సర్టిఫికెట్లను అందజేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ ఉపాధ్యాయుడు నూనె రమేష్ ఆధ్వర్యంలో వేసవి కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ తరగతులు సోమవారం ముగియడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె. వల్లీప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



రాజా రవికుమార్‌ను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

పాడేరురూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా డాక్టర్ ఎల్.రాజా రవికుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా విధులు నిర్వహించిన డాక్టర్ సీహెచ్.నర్సింహులు బొబ్బిలి బదిలీ కావడంతో పెదబయలు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌రాజా రవికుమార్‌కు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారిగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. రవికుమార్‌ను కార్యాలయ ఉద్యోగులు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది సత్కరించారు.

ముంచంగిపుట్టులో ముసురు వాతావరణం

ముంచంగిపుట్టు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ ఠారెత్తించింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కారుమబ్బులు కమ్ముకోవడంతో పాటు చిన్నపాటి వర్షం కురిసింది. అలాగే మండలంలోని పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. అకాల వర్షాల కారణంగా చల్లబడటంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లండి

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పాంగి రాజారావు

అనంతగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాంగి రాజారావు సూచించారు. మండలంలోని ములియగుడ వద్ద సోమవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శెట్టి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఏమన్నబాబు, మండల అధ్యక్షుడు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.


జగన్నాథ ఉత్సవాల పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

జగన్నాథ ఉత్సవాలు విజయవంతం కావాలి

చోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి ఉత్సవాలను ఈ ఏడాది మరింత విజయవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. తన కార్యాలయంలో సోమవారం జగన్నాథస్వామి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్‌తో పాటు ఉత్సవాల కరపత్రాలను కూడా విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, రాజు, తాతాజీ, అల్లాడ సత్యారావు, ఎ.గోపి, వాసు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 39 అర్జీలు

నర్సీపట్నం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 39 అర్జీలు అందినట్టు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని ఎక్కువగా దరకాస్తులు అందాయని చెప్పారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు పథకాలు అమలుచేయాలి


గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నర్సీపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు డి.మహాలక్ష్మి మాట్లాడుతూ అధికారిక రికార్డులలో అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని గౌరవ వేతనంతో బతుకుతున్న తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు ఆర్.రమణమ్మ, వెంటకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఆదివాసీల ఆందోళన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న ఆదివాసీలు

గొలుగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతమల్లంపేట రెవెన్యూలో సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీలు ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించినా న్యాయం జరగడం లేదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ పాతమల్లంపేట రెవెన్యూలో సర్వే నంబరు 850లో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములుకు హక్కులు కల్పించాలని కోరారు. ఈ భూములను సాగులో లేని వ్యక్తులకు ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత సాపిరెడ్డి నారాయణమూర్తి, సాగుదారులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదుపై విచారణ


జానకీరాంపురం పీఏసీఎస్‌లో విచారణ చేపడుతున్న అధికారులు

రోలుగుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జానకీరాంపురం పీఏసీఎస్‌లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అందిన ఫిర్యాదుపై సొసైటీలో సోమవారం ఆ శాఖ చోడవరం సబ్ డివిజన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ప్రశీత్‌కుమార్ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులైన సొసైటీ సభ్యులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, పచ్చిగొళ్ల ఈశ్వరరావు సమక్షంలో విచారణ చేపట్టారు. సస్పెండైన సీఈవో రామకృష్ణ నుంచి రూ.15 లక్షలు రికవరీ చేయాలని 2016-17లో నిర్వహించిన ఆడిట్‌లో నిగ్గు తేల్చారని, నేటి వరకు రికవరీ చేయలేదని సభ్యులు తెలిపారు. అలాగే సదరు సీఈవో ఉద్యోగ కాల పరిమితిలో చార్జి డిక్లరేషన్ లేకుండానే సుమారు 250 రుణాలు మంజూరు చేశారని, వాటిని చెల్లించాలని నోటీసులు జారీ చేయలేదని తెలిపారు. మధ్యలో ఆగిపోయిన సెక్షన్ 51 కింద విచారణను వేగవంతం చేయాలని, బినామీ రుణాలను నిగ్గుతేల్చాని కోరారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని విచారణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు


వైసీపీ కార్యకర్తలను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి సూర్యచంద్ర

నాతవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ మండలంలో ఇటీవల వైసీపీ కార్యకర్తలు ఎక్కువగా జనసేనలోకి వస్తున్నారని, ఇది పార్టీకి శుభసూచికమని చెప్పారు. ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటరమణ, ఎం.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సకల సదుపాయాలతో వసతిగృహాలు

రూ.కోటితో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లకు మరమ్మతులు

వేసవి సెలవులలో పది వసతిగృహాల పనులు పూర్తి

విద్యా సంవత్సరం ఆరంభానికి సర్వం సిద్ధం

విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వెల్లివిరిసిన ఆనందం

సాంఘిక సంక్షేమ వసతిగృహాలు సరికొత్త కళతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. వేసవి సెలవులకు ముందు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడిన ఈ హాస్టళ్లు, నేడు అన్ని ఆర్భాటాలతో దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరంలోకి అడుగు పెట్టేందుకు వచ్చేసరికి సర్వం సిద్ధమయ్యాయి. దాదాపు నెలన్నర రోజుల్లోనే పది వసతిగృహాలకు అన్ని హంగులతో తారసపడుతున్నాయి.

నర్సీపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాలను గత ఐదేళ్లు గాలికొదిలేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వసతిగృహాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో విద్యార్థులు పడరాని పాట్లు పడ్డారు. మరుగుదొడ్లకు తలుపులు ఊడిపోవడంతో మరుగు కోసం పరదాలు కట్టుకునే దుస్థితిలో దయనీయంగా కాలం వెల్లదీశారు. భవనాలు రంగులు వెలసిపోయి పాడుబడిన బంగ్లాలను తలపించేవి. శ్లాబ్ నుంచి వర్షం నీరు లీక్ కావడంతో విద్యార్థులు నానా అవస్థలు పడేవారు. శ్లాబ్ పెచ్చులు ఎక్కడ తమ మీద పడతాయోనని భయం భయంగా గడిపేవారు.

కూటమి ప్రభుత్వంలో హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వసతిగృహాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రధానంగా హాస్టల్ భవనాల మరమ్మతులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో చేయాల్సి పనులను గుర్తించి అంచనాలు తయారు చేయించింది. ఇక్కడి సహాయ సాంఘిక సంక్షేమ అధికారి పరిధిలోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, కొత్తకోట, రావికమతం మండలాల్లో పది వసతి గృహాల్లో రూ.1.02 కోట్లతో దాదాపు పనులు పూర్తి చేశారు. గొలుగొండ మండలంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. నాతవరం మండలంలో భవనం బయట సున్నాలు వేయాల్సి ఉంది. మిగిలిన అన్ని వసతిగృహాల్లోనూ శతశాతం పనులు పూర్తి చేశారు. ఇప్పుడు అన్ని హంగూఆర్భాటాలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి.


వేసవి సెలవుల తర్వాత పిల్లలను హాస్టల్‌కు తీసుకువచ్చిన తల్లిదండ్రులు


మరమ్మతులు చేశాక మరుగుదొడ్లు.. ఎడమ వైపు కుళాయిలు

ఏ వసతిగృహానికి ఎంత ఖర్చు పెట్టారంటే...

నర్సీపట్నం సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతిగృహాల అభివృద్ధి పనులకు మొత్తం రూ.1.02 కోట్లు వెచ్చించారు. ఇందులో రావికమతం బాలిక వసతిగృహం మరమ్మతు పనులను రూ.9.76 లక్షలతో పూర్తిచేశారు. పెదబొడ్డేపల్లి ఆనంద నిలయం హాస్టల్ రూ.10.19 లక్షలు, నర్సీపట్నం బాలుర వసతిగృహం రూ.15.45 లక్షలు, బాలికల వసతిగృహం రూ.9.4 లక్షలు, కళాశాల బాలికల హాస్టల్ రూ.2.31 లక్షలు, వేములపూడి బాలుర హాస్టల్ రూ.10.16 లక్షలు, నాతవరం బాలికల హాస్టల్ రూ.12 లక్షలు, చమ్మచింత బాలుర హాస్టల్ రూ.8.8 లక్షలు, గొలుగొండ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.12.44 లక్షలు వెచ్చించారు.

గిరిజనులకు అన్ని విధాలా అండగా ఉంటాం

» చుక్కపనుకులో చీరలు, గొడుగులు, వాలీబాల్ కిట్ల పంపిణీ

» త్వరలో వాటర్ ఫిల్టర్ ఇస్తాం: డీఎస్పీ శ్రీనివాసరావు

కృష్ణాదేవిపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు చెప్పారు. గొలుగొండ మండలంలోని కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు సమీపంలో కొండపై ఉన్న చుక్కపనుకు గిరిజన గ్రామాన్ని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సిబ్బందితో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతీ కుటుంబానికి గొడుగు, చీర, పంచెలు, యువతకు వాలీబాల్ కిట్లు తదితర సామాగ్రిని పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో హోమియో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పలువురుకు వైద్యసేవలు అందించారు. గ్రామంలో తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. దీంతో తాగునీటి శుద్ధి యంత్రం అవసరమని తెలపగా, త్వరలో వాటర్ ఫిల్టర్ ఇస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గంజాయి, మద్యం తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్య, క్రీడల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లు, సరకులు అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

డిగ్రీ కళాశాలలో యోగాపై శిక్షణ

చోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ ప్రారంభించారు. విశాఖలో ఈ నెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోరారు. కార్యక్రమంలో విద్యార్థులతో యోగా కార్యక్రమాలు చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ ఐవీ.సత్యవతి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ నారాయణమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, పిచ్చమ్మ, లక్ష్మీ మంగమ్మ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గొలుగొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో మేరీ రోజీ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు

నాతవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు పేర్కొన్నారు. నాతవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓ వైపు తల్లికి వందనం డబ్బులు ఇవ్వడమే కాకుండా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను కూడా భర్తీ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు రాజుబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

» మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

చోడవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రచురించిన వెన్నుపోటు పాలన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కలమైన హామీలు తప్పితే ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని చెప్పారు. కూటమి పాలన ప్రారంభమైన తరువాత రాష్ట్రంలో కేసులు, వేధింపులు, హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు, దొండా రాంబాబు, ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, బైన ఈశ్వరరావు, దేవరపల్లి సత్య, పుల్లేటి వెంకటేశ్, డీవీఆర్ నెహ్రూ పాల్గొన్నారు.



చోడవరం, దేవరాపల్లిలో పుస్తకాలు విడుదల చేస్తున్న మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు

ప్రజలకు వెన్నుపోటు: మాజీ మంత్రి బూడి

దేవరాపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. సోమవారం తారువ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, విద్యా వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. షుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడే కార్మికులు, ఉద్యోగుల పరిస్థితిని ప్రశ్నార్థం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, వైస్ ఎంపీపీ పి.సింహాచలంనాయుడు, నాయకులు కేవీ.రమణ, కె.సూరినాయుడు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నారాయణమూర్తి మృతి


నారాయణమూర్తి (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద నందిపల్లి మాజీ సర్పంచ్ రొంగలినారాయణమూర్తి (82) ఆదివారం రాత్రి మృతి చెందారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, సహకార సంఘం డైరెక్టర్‌గా గ్రామంలో ఆయన సేవలు అందించారు. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈకేవైసీకి రైతుల పడిగాపులు

నాతవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పంచాయతీల్లో సచివాలయాల దగ్గర ఈకేవైసీ చేయించుకోవడానికి రైతులు పడిగాపులు కాస్తున్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులు ఈ నెల 20వ తేదీన రైతుల ఖాతాల్లో పడతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో, రైతులందరూ మంగళవారం ఉదయమే గ్రామ సచివాలయాల దగ్గరకు పరుగులు తీశారు. ఆధార్ కార్డులతో వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని నిరీక్షించారు. ఈకేవైసీ లేకపోతే ఎక్కడ అన్నదాత సుఖీభవ డబ్బులు తమ ఖాతాల్లో పడకుండా పోతాయోనని భయంతో ఆయా గ్రామ సచివాలయాల దగ్గర పడిగాపులు కాశారు. సచివాలయ సిబ్బంది వచ్చిన తర్వాత కొందరు రైతులు ఈకేవైసీ చేయించుకోగా, మరికొందరు రైతులు సమయం చాలక పోవడంతో ఇంటి ముఖం పట్టారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం మంగళవారం ఒక్కరోజే ఈకేవైసీ చేయించుకోవడం జరుగుతుందని చాటింపు వేశారు. ఇప్పుడు ఈ నెల 19వ తేదీ వరకు రైతులు ఈకేవైసీ చేయించుకోవచ్చునని చెప్పడంతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే కొందరు రైతులు సోమ, మంగళవారాలలో తిరుపతి, కాశీవంటి తీర్థయాత్రలకు వెళ్తామని, తమను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఈకేవైసీ చేయించుకోవడానికి కనీసం పది రోజులైనా సమయం పెంచాలని కోరుతున్నారు. అలాగే ఈకేవైసీకి తక్కువ సమయం ఉండడంతో దూర ప్రాంతాలకు సొంత పనులపై వెళ్లిన రైతులు కూడా ఈకేవైసీ కాకపోతే డబ్బులు పడవని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈకేవైసీ చేయించుకోవడానికి పది రోజుల సమయమైనా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


వైడీపేట సచివాలయం దగ్గర పడిగాపులు కాస్తున్న రైతులు

19న మరిడిమాంబ జాతర

మాడుగుల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాడుగుల శివారు కండివరంలో మరిడిమాంబ జాతరను ఈ నెల 19న నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారిని శతకం పట్టు వద్ద కొలువు ఉంచుతామని చెప్పారు. తిరిగి ఈ నెల 19న ఉరేగింపుగా ఆలయానికి తీసుకువస్తామన్నారు. శాంతియుత వాతవరణంలో జాతర జరిగేలా భక్తులు సహకరించాలని కోరారు.

నేడు పరదేశమ్మ పండుగ

చీడికాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం గ్రామంలో పరదేశమాంబ పండుగను మంగళవారం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ పండుగను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

విశాఖ డెయిరీలో ప్రమాదం

» కాంట్రాక్టు కార్మికురాలికి తీవ్ర గాయాలు

» క్షతగాత్రురాలు స్వస్థలం మాకవరపాలెం

విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికురాలికి గాయాలయ్యాయి. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్మాగారంలోని స్టెరిలైజ్డ్ ఫ్లేవర్డ్ మిల్క్ (ఎస్ఎఫ్ఎం) విభాగంలో సోమవారం సాయంత్రం కొన్ని బాటిళ్లలో ఉష్ణోగ్రత అధికం కావడంతో ఒక్కసారిగా పేలిపోయాయి. ఆ సమయంలో సమీపంలో విధులు నిర్వహిస్తున్న లగుడు రాము (45)పై గాజుపెంకులతో పాటు వేడి పాలు పడ్డాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండల కేంద్రానికి చెందిన ఆమె ఇటీవలే విధుల్లో చేరినట్టు సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మన్ మృతి

మృతుడు కె.కోటపాడు మండల వాసి


అప్పారావు (ఫైల్)

పెందుర్తి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై వాచ్‌మన్ మృతి చెందినట్టు సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన అనపర్తి అప్పారావు (60) పెందుర్తి మరిడిమాంబ ఆలయ సమీపంలో గల ఓ నిర్మాణ స్థలంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. సోమవారం వాటరింగ్ పనుల నిమిత్తం బోరింగ్ వద్దకు వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. బోరుకు సంబంధించిన వైరు తెగిపడడాన్ని అప్పారావు గమనించకపోవడంతో పాటు ఆ ప్రదేశమంతా నీటి చెమ్మ కలిగిఉండడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఆయన భార్య గతంలోనే మృతి చెందిందని, పిల్లలు ఎవరూ లేరని సీఐ తెలిపారు. అప్పారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

రావికమతం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విధులకు తరచూ గైర్హాజరవుతున్న విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మేడివాడ గ్రామస్థులు డిమాడ్‌చేశారు. ఈ మేరకు సోమవారం ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డీఈ ఎస్.జనార్ధనరావుకు ఫిర్యాదు చేశారు. మేడివాడ మేజరు పంచాయతీలో సుమారు 1500 విద్యుత్ సర్వీసులు ఉన్నాయని, విద్యుత్‌కు నిలిచిపోతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని టీడీపీ నేత వజ్రపు శివ, ఎంపీటీసీ మాజీ సభ్యులు గొర్లె విజయ్‌కుమార్, చిన్నబాబు తదితరులు తెలిపారు. రెండు నెలలుగా గ్రామంలో ఈ పరిస్థితి ఉందని, సిబ్బందికి చెప్పినా స్పందించడం లేదని వాపోయారు. దీంతో రక్షిత నీటి పథకాల ద్వారా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై విచారణ తక్షణమే చేపట్టాలని ఏడీఈ సురేష్‌కుమార్‌ను డీఈ ఆదేశించారు.

పెట్రో వర్సిటీ భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

» నిర్మాణ పనుల్లో ఉండగా ప్రమాదం » ఆలస్యంగా వెలుగులోకి..


మృతి చెందిన కార్మికుడు షేక్ ఉమ్మరవల్లి

సబ్బవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలిలో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) వర్సిటీలో నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కార్మికుడు పడి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి. జిల్లాలోని చోడవరానికి చెందిన కార్మికుడు షేక్ ఉమ్మరవల్లి భవన నిర్మాణ కార్మికుడు. గత కొద్ది రోజులుగా వంగలి ఐఐపీఈలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో చేరాడు. ఈనెల తొమ్మిదో తేదీన పని చేస్తుండగా ఓభవనం పైనుంచి కాలుజారి పడి మృతిచెందాడు. ఈ ఘటనను గోప్యంగా ఉంచి మృతుడి కుటుంబానికి రూ.మూడు లక్షలు ఇచ్చారు. ఇన్సూరెన్స్ కింద మరో రూ.15 లక్షలు ఇప్పిస్తామని సదరు కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ విషయం సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి దృష్టికి రావడంతో ఆమె వెంటనే స్పందించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధిత కుటుంబం పక్షాన పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. ఈ సంఘటనపై సీఐ జి.రామచంద్ర రావును వివరణ కోరగా, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

బుచ్చెయ్యపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడి పీహెచ్‌సీతో పాటు సీతయ్యపేట గ్రామంలో క్షయ నివారణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సంధ్యారాణి, సునీల్ మాధవ్ మాట్లాడుతూ క్షయ లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రపు ఇందిరా, వైద్య సిబ్బంది రాజశేఖర్, రమణ, చంద్రమౌళి, అయ్యప్పరెడ్డి, పి.రాజుబాబు, నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రావికమతం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రావికమతం, కొత్తకోట సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. మట్టవానిపాలెం, పిల్లవానిపాలెం, గుడివాడ, దాసరయ్యపాలెం, ని కన్నంపేట, వమ్మవరం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

దేవరాపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరుగులు, విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ సోమవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాల నమూనాలను సేకరించి క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ తాడేపల్లి గూడెంకు పంపినట్టు ఏవో చెప్పారు. అలాగే ధరలు పట్టికను షాపు ముందు పెట్టాలని, బిల్లులు ఇవ్వాలని ఆమె సూచించారు.

యోగాంధ్రకు సన్నద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- అధికారులకు కీలక సూచనలిచ్చిన ముఖ్యమంత్రి

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరంలో ఏర్పాట్లను పరిశీలించి, సూచనలు ఇచ్చారు. గిన్నిస్ రికార్డు సాధనకు కృషి జరుగుతోందని, దీనికి ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సహా పలువురు ప్రముఖులు పాల్గొనే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.


బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు


కాన్వాయ్‌లోంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు


ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సమావేశ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు


ఏయూలో యోగాంధ్ర ఏర్పాట్లను సీఎంకు వివరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



యోగాంధ్ర సమావేశంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు లోకేశ్, అనిత


ప్రజల నుంచి సమస్యల వినతిపత్రాలను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



నోవాటెల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, వేదికపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



ఏడాదిలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు


హోటల్ నోవాటెల్‌లో నిర్వహించిన యోగాంధ్ర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు


పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

సింహాద్రి మూడో యూనిట్ షట్‌డౌన్

- 500 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడో యూనిట్‌ను ఆదివారం అర్ధరాత్రి అధికారులు షట్‌డౌన్ చేశారు. వార్షిక నిర్వహణ పనులు నిమిత్తం 45 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తి చేయరు. నిర్వహణ పనులు పూర్తయ్యాక ఉత్పత్తిని పునరుద్ధరిస్తారు. ప్రస్తుతం ప్లాంట్‌లో మిగిలిన మూడు యూనిట్లలో ఉత్పత్తి యథావిధిగా జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు.

‘తల్లికి వందనం’పై వైసీపీ దిగజారుడు ఆరోపణలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు

అనకాపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు కుటుంబంలో ఎంత మంది చదువుకునే పిల్లలు వుంటే అంత మందికీ ‘తల్లికి వందనం’ పథకాన్ని అమలుచేస్తున్నామని, దీనిని సహించలేని వైసీపీ నాయకులు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు విమర్శించారు. టీడీపీ అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వీరు మాట్లాడారు. తల్లికి వందన పథకం కింద కేటాయించిన నిధుల్లో రూ.2 వేల చొప్పున మంత్రి లోకేశ్ జేబులోకి పోయాయంటూ అసత్య ఆరోపణలు చేశారని, దీనిపై ఆయన విసిరిన సవాల్‌ను స్వీకరించలేదని దద్దమ్మలంటూ వైసీపీ నేతలపై ధ్వజమెత్తారు.

వైసీపీ హయాంలో అమ్మఒడి పథకం కింద ఒక కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రూ.13 వేలు ఇచ్చారని, మిగిలిన రూ.2 వేలు నాటి సీఎం జగన్ జేబులోకి పోయాయా అని ప్రశ్నించారు. మీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 42 లక్షల మందికి మాత్రమే అమ్మఒడి పథకాన్ని అమలు చేశారని, ఇప్పుడు తమ ప్రభుత్వం 67.27 లక్షల మందికి తల్లికి వందన పథకాన్ని అమలు చేస్తున్నదని చెప్పారు.


మీడియా సమావేశంలో నాగజగదీశ్వరరావు, తాతయ్యబాబు

ప్రతి బిడ్డకు రూ.13 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తున్నారని, వారి ముఖాల్లో ఆనందం చూడలేక సొంత పత్రికలో తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో చేరే విద్యార్థులు మరో 11 లక్షల మంది వుంటారని, త్వరలో వీరికి కూడా తల్లికి వందనం సాయం అందుతుందని చెప్పారు. తల్లికి వందన పథకం ద్వారా సాయం అందుతున్న వారిలో బీసీ విద్యార్థులు 29.82 లక్షల మంది, ఎస్సీ విద్యార్థులు 11.76 లక్షల మంది, ఎస్టీ విద్యార్థులు 4.26 లక్షల మంది, మైనారిటీ విద్యార్థులు 66.500 మంది, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 8.44 లక్షల మంది ఉన్నారని తెలిపారు.

గంగాదేవిపేటలో వివాహిత ఆత్మహత్య

మునగపాక, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వారి వేధింపులతో మండలంలోని గంగాదేవిపేటలో ఒక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం గ్రామానికి చెందిన దుంగ పైడికుమారి (30)కి, మునగపాక మండలం గంగాదేవిపేటకు చెందిన బత్తిన వెంకటేశ్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి రీత్యా వెంకటేశ్ సింగపూర్‌లో ఉండడంతో, ఇద్దరు పిల్లలతో కుమారి గంగాదేవిపేటలోనే ఉంటున్నది. పాఠశాలలకు వేసవి సెలవుల సమయంలో కుమారి, పిల్లలను తీసుకొని రేవుపోలవరంలో పుట్టింటికి వెళ్లింది. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో సోమవారం ఉదయం పిల్లలను తీసుకొని నేరుగా అనకాపల్లిలో పాఠశాలలకు వచ్చి, వారిని అక్కడ వదిలి గంగాదేవిపేట చేరుకుంది. తరువాత ఏం జరిగిందో తెలియదుగాని కుమారి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందంటూ ఆమె తల్లి నూకరత్నానికి, అత్త వరలక్ష్మి మధ్యాహ్నం ఫోన్‌చేసి చెప్పింది. నూకరత్నం వచ్చి, కుమార్తె మృతదేహాన్ని చూసి భోరున విలపించింది. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అదనపు కట్నంతోపాటు తన కుమార్తెకు వివాహేతర సంబంధం అంటగట్టి తరచూ వేధించేవారని, ఆమె ఆత్మహత్యకు అత్తమామలు వరలక్ష్మి, పోతురాజు, బావ, తోటికోడలు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నది. అనంతరం ఏఎస్‌ఐ వచ్చి పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. తరువాత పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ ధనుంజయరావు గంగాదేవిపేట వెళ్లి విచారణ చేపట్టారు. ఏఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.38.62 లక్షలు

అనకాపల్లి టౌన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి హుండీల కానుకల లెక్కింపు సోమవారం జరిగింది. 48 రోజులపాటు భక్తులు హుండీల్లో వేసిన కానుకలు, ముడుపుల ద్వారా రూ.38,62,426 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో వెంపలి రాంబాబు తెలిపారు. బంగారం 16,500 మిల్లీ గ్రాములు, వెండి 900 గ్రాములు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కేఎల్‌సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, సభ్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముంబైకు దీటుగా విశాఖ అభివృద్ధి

... 3వ పేజీ తరువాయి

పరుగులు పెట్టిస్తున్నామన్నారు. విశాఖ బ్రాండ్‌ను పెంచగలిగితే ఆకాశమే హద్దుగా అభివృద్ధి చెందుతుందన్నారు. విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనివల్ల విమానాల్లో ఉద్యోగాలు చేసే స్థాయికి మన పిల్లలు చేరుకుంటారన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తైతే..విశాఖ మరో ఎత్తన్నారు. భవిష్యత్తులో విశాఖకు మెట్రో రైలు వస్తుందని పేర్కొన్నారు. గతంలో తాను మెట్రోకు సంబంధించిన ప్రతిపాదనలను పెడితే..ఐదేళ్ల ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా పరిస్థితి ఉందన్నారు. విశాఖకు ఇప్పటికే టీసీఎస్ వచ్చిందని, త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందన్నారు. ప్రపంచంలోని డేటాను విశాఖకు తెచ్చి ఏఐ సాయంతో విశ్లేషించనున్నట్టు తెలిపారు. ఇందుకు సింగపూర్ నుంచి విశాఖకు సముద్ర మార్గంలో కేబుల్ వేయనున్నట్టు చంద్రబాబునాయుడు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు వస్తోందని, అది ఏర్పాటైతే అక్కడ స్టీల్ సిటీ ఏర్పాటవుతుందన్నారు.

ప్రభుత్వ భూముల తాకట్టు..

గత వైసీపీ పాలకులు విశాఖలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కాలేజీలు, కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాలను తాకట్టు పెట్టేశారని చంద్రబాబు ఆరోపించారు. ఫైనాన్స్ కమిషన్ నుంచి రెండేళ్లకు రావాల్సిన డబ్బులను ముందుగానే డ్రా చేశారన్నారు. విశాఖలో భారీఎత్తున భూ కబ్జాలకు పాల్పడ్డారని, వైసీపీ పాలకులకు ఇష్టం లేని భూములను 22ఏలో పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయితే, తాము అధికారంలోకి వచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని, భూములు జోలికి వెళ్లాలంటే వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు చేపట్టామన్నారు. భూమి రికార్డుల్లో మార్పులు చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో వాటిని పరిరక్షించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

విశాఖ కేంద్రంగా ఎకనామిక్ హబ్..

విశాఖ కేంద్రంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎకనామిక్ హబ్ అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు రిపోర్ట్ తయారైందన్నారు. కాకినాడ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకూ గల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బెస్ట్ ఎకమినామిక్ కారిడార్‌గా నిలుస్తుందన్నారు.

యోగాలో భాగస్వాములు కావాలి..

ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంతో విశాఖను ప్రపంచపటంలో పెట్టే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ మ్యాట్, టీ షర్ట్ ఇస్తామన్నారు. ప్రతిరోజూ ఇంటి వద్ద యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. 45 నిమిషాలపాటు ఎంతమంది యోగా చేస్తారో చేతులు ఎత్తాలని చంద్రబాబు చెప్పగా.. అందరూ చేతులెత్తేశారు. దీనికి ఆయన నవ్వుతూ..తనపై ఒట్టేసి చెప్పాలని కోరడంతో అందరూ నవ్వుకున్నారు.

గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా.?

నగర పరిధిలో రోడ్లు బాగుండాలని, ఎక్కడా గుంత కనిపించకూడదని చంద్రబాబునాయుడు అన్నారు. గుంత కనిపిస్తే మేయర్ పదవి గోవిందా అంటూ పీలా శ్రీనివాస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించినప్పుడు అంతా నవ్వారు. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు లేచి ఎయిర్‌పోర్టులో మీపై దాడి జరిగిన వ్యవహారంపై దృష్టిసారించాలని కోరగా..తన దృష్టిలో ఉందని చంద్రబాబునాయుడు సమాధాన మిచ్చారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన కొడాలి నాని, పేర్ని నానిలను అరెస్టు చేయాలని కొందరు, జగన్‌ను అరెస్ట్ చేయాలని మరికొందరు నినాదాలు చేశారు.

స్టీల్‌ప్లాంటును కాపాడిన ఘనత ఎన్‌డీఏదే..

... 3వ పేజీ తరువాయి

ఉన్న అభిమానమే కారణమన్నారు. ఉద్యోగులు ప్లాంటును శాశ్వతంగా రక్షించుకునేందుకు లాభాల బాటలో పయనించేలా చేయాలన్నారు. స్టీల్‌ప్లాంటు 20 వేల ఎకరాల్లో ఉందని, ఎకరా ఆరు కోట్లు చొప్పున చూసినా లక్ష కోట్లకుపైగా ఆస్తి ఉందన్నారు. దీన్ని కాపాడుకుని రాష్ట్రాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. గత ప్రభుత్వం విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుకు భూమి అడిగితే ఇవ్వలేదని చంద్రబాబునాయుడు ఆరోపించారు. అయితే, అభివృద్ధి విషయంలో తాము ఎక్కడా రాజీ పడకుండా భూమిని కేటాయించామన్నారు. ఎన్టీపీసీ అనకాపల్లి జిల్లాలో లక్షా 85 వేల కోట్లు రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తిచేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు శ్రీకారం చుట్టిందని, నక్కపల్లిలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మూడు, నాలుగు ఫార్మాస్యూటికల్ కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. వాటి వల్ల పెద్దఎత్తున స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

పారిశ్రామిక పరుగులు!

... 3వ పేజీ తరువాయి

సన్నద్ధమవుతున్నది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో భూసమీకరణ పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. అనకాపల్లి మండలం కోడూరులో సుమారు 70 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు పనులు జోరుగా సాగుతున్నాయి. స్థానికులతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయించి, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడమే కాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పించడం ప్రభుత్వ ఉద్దేశం.

విద్యా శాఖలో బదిలీలు పూర్తి

... 3వ పేజీ తరువాయి

బదిలీపై వచ్చారు. హెచ్‌ఎం బదిలీలు ముందుగానే జరగడంతో వారంతా ఇప్పటికే విధుల్లో చేరారు. పాతవారు రిలీవ్ అయ్యారు. జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు మాట్లాడుతూ, బదిలీ అయిన ఉపాధ్యాయులంతా ఒకటి, రెండు రోజుల్లో వారికి కేటాయించిన స్కూళ్లలో చేరాలని అన్నారు.

బ్యాంకులకు తల్లికి వందనం తాకిడి

... 3వ పేజీ తరువాయి

తల్లులు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. దేవరాపల్లిలోని యూకో బ్యాంకు, మూడు వినియోగదారుల సేవా కేంద్రాలు, ఎస్‌బీఐ, దాని వినియోగదారుల సేవా కేంద్రం ద్వారా సుమారు రూ.20 లక్షల మేర చెల్లింపులు జరిగినట్టు ఆయా బ్యాంకుల అధికారుల ద్వారా తెలిసింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	77.00
లైవ్ ధర	97.00
విత్ స్కిన్	164.00
స్కిన్ లెస్	174.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554